క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం విశేషాభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. శ్రీవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

మోదీకి శుభాకాంక్షలు



ముత్తుకూరు: మండలంలోని సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం కానుగ ఆకుపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రంగుల చిత్రాన్ని రూపొందించారు. మూడోసారి ప్రధానిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మోదీకి సూక్ష్మ చిత్రం ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో పలు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ టీ కామేశ్వరి శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంగ్లిషు, హిందీ, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హత కలిగిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను పూర్తి చేసి ఈ నెల 12, 13 తేదీల్లో తమ పాఠశాలలో అందజేయాలని సూచించారు. ఇంగ్లిష్‌లో టీజీటీ, పీజీటీ, ఫిజికల్ సైన్స్‌లో పీజీటీ, హిందీలో టీజీటీ, పీజీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వివాదాలకు దూరంగా ఉండండి



ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు స్నేహపూర్వకంగా మెలగాలని, వివాదాలకు దూరంగా ఉండాలని సీఐ గిరిబాబు సూచించారు. ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురిని పిలిపించి తగాదాలతో వచ్చే పరిణామాలను శనివారం వివరించారు. ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల కార్డన్ సెర్చ్ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలను సరైన పత్రాలు చూపించి తీసుకెళ్లాలని తెలిపారు. ఆయన వెంట ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కేన్సర్ నివారణపై అవగాహన

వింజమూరు(ఉదయగిరి): ప్రతి ఒక్కరూ కేన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత డీఎంహెచ్‌ఓ మాసిలామణి అన్నారు. వింజమూరులో శనివారం కేన్సర్, మెదడులో కణుతులు తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు రోజులో ఎక్కువ సేపు సెల్‌ఫోన్స్‌తో గడపడం ద్వారా వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. రోజుకు 18 గంటలకు పైగా కంప్యూటర్, సెల్ వినియోగం ఉన్న వారిలో మెదడులో కణుతులు ఏర్పడి కేన్సర్‌గా మారవచ్చన్నారు. ఈ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాన్నారు. అనంతరం పలువురు రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

కొల్లపునాయుడుపల్లిలో ఫ్యామిలీ డాక్టర్

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం కొల్లపునాయుడుపల్లి సబ్‌సెంటర్‌లో చిత్తలూరు పీహెచ్‌సీ డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మంజుల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనుకు రక్ష.. భూసార పరీక్ష

భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. వేసే పంటలు..వాడే ఎరువులు, క్రిమి సంహారక మందులను బట్టి మార్పు చెందుతుంది. ఆ మార్పులను ఎప్పటికప్పుడు కనిపెట్టి పంటలు సాగుచేస్తేనే మంచి దిగుబడులు వస్తాయి. అందుకోసం పంటల సాగుకు ముందుగా విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తద్వారా ఎరువుల పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు.



మట్టి నమూనాలను కలుపుతున్న వ్యవసాయాధికారులు (ఫైల్)



మట్టి నమూనాలను సేకరిస్తున్న రైతు (ఫైల్)

కోవూరు: కోవూరు నియోజకవర్గ పరిధిలో సాధారణంగా రబీలో సుమారు లక్ష ఎకరాల్లో, ఎడగారులో సుమారు 80వేల ఎకరాల్లో సాగుచేపడుతుంటారు. రైతులు భూమిలోని పోషకాలను తెలుసుకోకుండానే పంటలకు విచ్చల విడిగా అన్ని రకాల ఎరువులను వాడుతున్నారు. ఫలితంగా ఎరువుల పెట్టుబడి తడిసి మోపెడవుతోంది. ఈ నేపథ్యంలో ఎరువుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా క్షేత్రస్థాయిలోని వ్యవసాయాధికారులు మట్టినమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేపట్టి రైతులకు సూచనలు చేస్తున్నారు. భూసార పరీక్షలతో భూమిలోని పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార స్థితి, చౌడు, తదితరాలు తెలుస్తాయి. అందుకనుగుణంగా పంటకు ఏఏ ఎరువులను..ఎంత మోతాదులో వినియోగించాలో సూచిస్తున్నారు. తద్వారా రైతులకు ఎరువుల భారం గణనీయంగా తగ్గుతోంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గాలు అనుసరించాలి. భూమిలోని పోషకాలను తెలుసుకుని అందుకనుగుణంగా పంటల సాగు, ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులు వచ్చి ఆదాయం పొందే అవకాశం ఉంది. అలాకాకుండా అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో రసాయన ఎరువులు, పురుగు మందులు అవసరానికి మించి వినియోగించడం వల్ల భూమిలోని పోషకాలు నశిస్తాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదకశక్తిని కోల్పోయి చౌడు బారడంతో పాటు చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ కారణంగా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- రబీ పంట కోతలు పూర్తయిన తర్వాత వేసవిలో మట్టి నమూనాలు సేకరించాలి.
- పొలాలకు సాగునీరు పెట్టినప్పుడు, ఎరువులు వేసిన తరువాత మట్టి నమూనాలు సేకరించకూడదు.
- పొలాల్లో గట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనాలు తీయకూడదు. ముందుగా నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసివేయాలి.
- పొలంలో 15 నుంచి 20 సెంటీ మీటర్ల లోతున పారతో గుంతతీసి పైపొర నుంచి కింది వరకూ మట్టిని సేకరించాలి. సుమారు ఎనిమిది ప్రదేశాల్లో సేకరించిన మట్టిని పట్టపై పోసి బాగా కలిపి అరకేజీ మట్టిని తీసుకుని నీడలో ఆరబెట్టాలి. మట్టి బాగా ఆరిన తరువాత పాలిథిన్ కవర్‌లో నింపి రైతు వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి భూసార పరీక్ష కేంద్రానికి పంపాలి.
- వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాల లోతు నుంచి నమూనా సేకరించాలి. పండ్ల తోటలకు మూడు అడుగుల లోతులో ప్రతి అడుగుకు ఒక నమూనా తీయాలి. చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతుతో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి. వ్యవసాయ క్షేత్రాల్లో సేకరించిన మట్టిని ప్రయోగశాలలకు తరలించి వివిధ భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని, లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత, నేల, ఆమ్ల, క్షార గుణాలు, పోషకాల స్థాయిని విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా సాగుచేయాల్సిన పంటలు, వినియోగించే ఎరువుల మోతాదును సూచిస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడుల సాధనకు అవకాశం కలుగుతంది. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

> పంట సాగుకు ముందుగా భూసార పరీక్షలను రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలి. తద్వారా భూమిలో లోపించిన పోషకాలను గుర్తించవచ్చు. అందుకనుగుణంగా ఎరువులను వినియోగించడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలు కలుగుతుంది. గతేడాది కోవూరు మండలంలో యూరియా ఎక్కువ మోతాదులో ఉన్నట్లు గుర్తించాం. పంటలకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ, జీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.
>
> – ఇందిరావతి,ఏఓ, కోవూరు

విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో అవస్థ

విడవలూరు: మండల కేంద్రమైన విడవలూరులో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు తలెత్తుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం అందించకుండా ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా ఇష్టానుసారంగా కరెంట్ నిలిపివేస్తుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు సమాచారం ఇస్తే తాగునీటితో పాటు ఇతర అవసరాలకు తగిన ఏర్పాట్లు చేసుకుంటామని వాపోతున్నారు. ఇకనైనా విద్యుత్ అధికారులు స్పందించి కరెంట్ కోతలు తగ్గించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆంజనేయస్వామికి సువర్ణ అలంకరణ



సువర్ణ అలంకరణలో దర్శనమిస్తున్న ఆంజనేయస్వామి

ముత్తుకూరు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు, పల్లకిసేవ నిర్వహించారు. ఆంజనేయస్వామి సువర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చౌకచర్ల లక్ష్మణరెడ్డి,బుజ్జమ్మ జ్ఞాపకార్థంగా చౌకచర్ల భాస్కరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ప్రమాదభరితంగా మలుపులు



ఇనుకుర్తి వద్ద ప్రమాదకరంగా రోడ్డు మలుపు

పొదలకూరు: మండలంలోని పలు మార్గాలో మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. పొదలకూరు–రాపూరు మార్గంలో ఇనుకుర్తిలోని జెడ్పీహైస్కూల్, మర్రిపల్లి వద్ద ఉన్న మలుపుల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గంలో కంకర తరలించే టిప్పర్లు వేగంగా వెళ్తుంటాయి. డబుల్‌రోడ్డు అయినప్పటికీ మలుపుల వద్ద వేగంగా వెళ్లే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక వాహనచోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. అలాగే పొదలకూరు–సోమశిల రోడ్డులోని లింగంపల్లి తోపు వద్ద, నావూరు–పొదలకూరు మార్గంలోని అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం, నావూరు వద్ద మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. సంగం–పొదలకూరు మార్గంలోని విరువూరు వద్ద మలుపులు ఇబ్బందికంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోనూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



విశేషాలంకారంలో వెంకయ్యస్వామి

మనుబోలు: మనుబోలు–చెర్లోపల్లి మార్గంలోని భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో శనివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. వెంకయ్యస్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. హోమగుడం వేసి ధునిపూజ చేశారు. ఆశం సురేష్ తన భార్య ఉమారాణి జ్ఞాపకార్థంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

దోమల నివారణతో మలేరియాను పారదోలుదాం



మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

కొడవలూరు: దోమలను నివారించడం ద్వారా మలేరియాను పారదోలుదామని యల్లాయపాళెం వైద్యాధికారిని సింధు మేఘన పిలుపునిచ్చారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని యల్లాయపాళెంలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది మలేరియాపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల కారణంగానే మలేరియా వ్యాధి సోకుతుందన్నారు. రెండ్రోజుల కంటే ఎక్కువ చలి, జ్వరం వస్తుంటే మలేరియాగా అనుమానించి వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మలేరియాపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రాణాంతకంగా మారుతుందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. రాత్రి వేళ దోమతెరలు వాడడం ద్వారా దోమల బారిన పడకుండా చూసుకోవాలని చెప్పారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యూఓ నాగరాజు, పీహెచ్‌ఎన్ విజయ, ఏఎన్‌ఎం సుకన్య, స్టాఫ్‌నర్స్ స్వర్ణలత, హెచ్‌ఏలు ప్రసాద్, ఎం సురేష్ పాల్గొన్నారు.

పొదలకూరులో భారీ వర్షం



పొదలకూరులో కురుస్తున్న వర్షం

పొదలకూరు : మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండలంలోని రైతులు ఎడగారు నాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో భారీ వర్షం కురిసి ఇబ్బందులకు గురిచేసింది. భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గత రెండురోజులుగా మబ్బులు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో పొదలకూరులో ఓ మోస్తరు వర్షం పడింది. శనివారం భారీ వర్షం పడడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. దీంతో ఉక్కపోత, ఎండవేడిమితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. నిమ్మతోటల వర్షం వల్ల ఉపయోగం ఉంటుందని నిమ్మ రైతులు తెలిపారు.

పుట్టాపై ప్రశాంతిరెడ్డి అసహనం

కోవూరు: కోవూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జొన్నవాడ ఆలయ మాజీ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యనాయుడిపై అసహనం వ్యక్తం చేశారు. జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయిని ప్రశాంతిరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆ సమయంలో ఆలయ ఈఓపై పుట్టా చాడీలు చెప్పేందుకు ప్రయత్నించగా ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఎప్పుడూ ఎవరో ఒకరిపైన చాడీలు చెప్పడం మంచిదికాదని, తన పర్యటన వివరాలు అందరికీ తెలియజేయాలని, అందరిని కలుపుకొని పోవాలని మందలించారు. దీంతో పుట్టా దంపతులు అలిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వెంకటాచలంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలో శనివారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎలెక్షన్ కౌంటింగ్ ముగిసిన తరువాత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో శాంతి భద్రతల దృష్ట్యా డీఎస్పీ వీరాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో బీఎస్‌ఎఫ్, పోలీస్ సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

ఎడగారు సాగుకు తప్పని తిప్పలు



విరువూరులో వరినాట్లకు నారు సిద్ధం చేస్తున్న రైతులు



మహ్మదాపురంలో వరి నాట్లలో పలుచగా ఉన్న నీరు

పొదలకూరు: మండలంలోని రైతులు ఎడగారు సాగుకు సాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు. ఈ ఏడాది సోమశిల అడుగంటడంతో ఎడగారుకు సాగు నీరు విడుదల చేయలేదు. దీంతో కాలువలు ఎండిపోయాయి. మరోవైపు గతేడాది వర్షాలు సక్రమంగా కురవక భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో బోర్లలోనూ నీరు తగ్గిపోయింది. దీంతో డెల్టా గ్రామాలుగా పేరున్న మహ్మదాపురం, విరువూరు, సూరాయపాళెం, తాటిపర్తి గ్రామాల్లోని రైతులు ఎడగారు సాగుకు మునుపెన్నడూ లేని విధంగా సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మూడు దశాబ్దాల కాలంలో ఎడగారు సాగుకు ఇంతలా ఇబ్బంది పడింది లేదని రైతులు వాపోతున్నారు. పెన్నార్ డెల్టా గ్రామాల రైతులు కాలువల సాగునీటితో పాటు బోర్ల ద్వారా వరిసాగు చేస్తుంటారు. ఈ గ్రామాల్లో బోర్ల కింద మే నెలాఖరు నుంచి ఎడగారు నాట్లు వేస్తున్నారు. సుమారు 1000 ఎకరాల్లో సాగుచేపడుతున్నారు. ఎకరా సాగుకు రూ.22వేల వరకు వెచ్చిస్తున్నారు. విరువూరు సప్లై ఛానల్ నుంచి చుక్కనీరు రావడం లేదు. పెన్నానది ప్రవాహం లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి బోర్లలో నీరు సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా బాలు జయంతి వేడుకలు



బాలు గీతాలను ఆలపిస్తున్న ఎస్పీ శైలజ



సంగీత దర్శకుడు విద్యాసాగర్‌కు విద్వన్మణి బిరుదుతో సత్కారం

నెల్లూరు(మినీబైపాస్): చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను పురమందిరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత విశ్రాంత తెలుగు అధ్యాపకులు మెట్టు రామచంద్రప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రముఖ సినీ సంగీత దర్శకుడు విద్యాసాగర్‌కు సంగీత విద్వన్మణి బిరుదుతో బాలు పురస్కారాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా బాలు అన్నమయ్య చిత్ర సంకీర్తనలకు నర్తన మయూరి దివ్యపావని ప్రదర్శించిన నృత్యనీరాజనం అలరించింది. బాలు సినీ చిత్ర గీతావళిని నాగార్జున, శైలజ ఆలపించి శ్రోతలను మైమరిపించారు. విశ్రాంత ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీ కవి భువనచంద్ర, సినీ గాయని ఎస్పీ శైలజ, సినీ నటుడు శుభలేఖ సుధాకర్, మద్దాళి రఘురాం, వీరిశెట్టి హజరత్ బాబు, రాజేంద్రకుమార్, కొల్లూరు శ్రీనివాసరావు, విద్యాసాగర్, బలరామయ్యనాయుడు, వెంకటరామయ్య, చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక కార్యదర్శి వై శేషగిరీశం పాల్గొన్నారు.



కళాకారుల నృత్య ప్రదర్శన



ఆకట్టుకున్న లవకుశలు